క్లుప్తంగా

జాబ్ మేళాలో 68 మందికి ఉద్యోగాలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ మేళాలో టెక్ మహీంద్ర, స్కిల్ క్రాఫ్ట్, హిటాచీ, రైటర్ సన్స్ ప్రైవేటు లిమిటెడ్, వరుణ్ మోటార్స్ ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 221 మంది హాజరుకాగా వారిలో 68 మంది హాజరైన కంపెనీలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మురళి మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించే జాబ్‌మేళాలను, శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి బి.శ్రీనివాస్, యంగ్ ప్రొఫెషనల్ ఈ.హారిక సౌగంధి, జేకేసీ కో ఆర్డినేటర్ సాయి ప్రసన్న, మెంటార్ ఎస్వీ సుబ్బారెడ్డి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ హారిక, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బైకు ఢీకొని మహిళా పోలీస్‌కు గాయాలు

బల్లికురవ: విధి నిర్వహణలో భాగంగా బల్లికురవ వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొట్టటంతో సచివాలయ మహిళా పోలీస్ గాయాల పాలైంది. ఈ ఘటన సోమవారం బల్లికురవ–అద్దంకి ఆర్‌అండ్ రోడ్డులోని గుంటుపల్లి గ్రామ సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం బల్లికురవ గ్రామానికి చెందిన గెల్లా రత్నకుమారి వల్లాపల్లి సచివాలయంలో మహిళా పోలీస్‌గా పనిచేస్తోంది. బల్లికురవ వస్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రత్నకుమారిని స్థానికులు చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

తప్పిన పెను ప్రమాదం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): వినాయకుడి విగ్రహం విద్యుత్ వైర్లకు తగలడంతో పెనుప్రమాదం తప్పింది. ఈఘటన సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు వివరాల మేరకు.. నార్కెట్‌పల్లి–మేదరమెట్ల నామ్ రహదారిపై హైదరాబాద్ వైపు నుంచి నెల్లూరుకు లారీలో వినాయకుడి భారీ విగ్రహాన్ని తీసుకెళ్తున్నారు. ఈక్రమంలో ఏల్చూరు గ్రామంలోని రాగానే లారీపై ఉన్న వినాయకుడి విగ్రహం 11 కేవీ విద్యుత్ వైరును తగలటంతో వైరు తెగి నిప్పులు చెలరేగుతూ కిందపడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఆక్కడ జనసంచారం లేదు. ఎటువంటి వాహనాలు వెనుక రాలేదు. అందువల్ల పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

విద్యుత్ పోల్‌ను ఢీకొట్టిన కారు



ధ్వంసమైన కారు ముందు భాగం

అద్దంకి రూరల్: కారు అదుపుతప్పి విద్యుత్ పోల్‌ను ఢీకొట్టిన ఘటన సోమవారం అద్దంకిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అద్దంకి–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు భార్యభర్తలు తన్నీరు నాగేశ్వరరావు, తన్నీరు పాపమ్మలు కారులో వెళ్తున్నారు. ఈనేపథ్యంలో అద్దంకి సమీపంలోని రాజీవ్ సమీపంలోకి రాగానే కారు అదుపుప్పి కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ పోల్‌ను ఢీకొట్టింది. కారులో ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ఇరువురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వెలగని లైట్లు.. తప్పని ఇక్కట్లు !

- హైవే ఫ్లడ్ లైట్లు వెలిగేది ఎప్పటికో ?
- అలంకార ప్రాయంగా మారిన ఫ్లడ్ లైట్లు



టీ జంక్షన్ వద్ద హైవే అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లు

చినగంజాం: జాతీయ రహదారి 216 చినగంజాం టీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లు అలంకార ప్రాయంగా మారాయి. జాతీయ రహదారి నుంచి చినగంజాం గ్రామంలోనికి వెళ్లే ప్రాంతంలో జాతీయ రహదారి నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లలో గత కొంత కాలంగా వెలుగు లేకుండా పోయింది. జాతీయ రహదారి చినగంజాం టీ జంక్షన్ వద్ద ప్రయాణికులు 24 గంటలు ప్రయాణాలు సాగిస్తుంటారు. ఆర్టీసీ సర్వీసులు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటలు వరకు ప్రయాణిస్తుండగా దూర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ బస్సులకు రాత్రిళ్లు ఇక్కడ స్టాపింగ్ ఉండగా ప్రయాణికులు బస్సులు ఎక్కేవారు, దిగే వారితో ఈ ప్రాంతం కొనసాగుతూ ఉంటుంది. చినగంజాం గ్రామం అక్కడి నుంచి 3 కి.మీ దూరం కావడంతో రాత్రి వేళ కష్టంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రయాణికులు బస్సు దిగేందుకు వారిని రిసీవ్ చేసుకునేందుకు వచ్చే వారి సంబంధీకులు ఈ ప్రాంతమంతా చీకటిగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి అధికారులు ఈ ప్రాంతంలో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయక పోగా భారీ ఎత్తులో ఉండే స్తంభానికి కింది భాగంలో వేలాడదీసి వెలిగించకుండా చేతులు దులిపేసుకున్నారు. ప్రజల ఒత్తిడి మేరకు తాత్కాలికంగా ఒక కొద్దిపాటి లైటు ఏర్పాటు చేసినప్పటికీ దాని వెలుగు ఆ ప్రాంతంలో సరిపోవడం లేదు. దాంతో వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రాత్రి వేళ వేచి ఉండాలంటే కష్టమే..

ప్రయాణాలు సాగించే వారితో పాటు వారిని బస్టాప్‌లో వదలిపెట్టేందుకు, బస్సులో వచ్చే వారిని తీసుకెళ్లేందుకు ఆ ప్రాంతంలో వేచి ఉండాలంటే ప్రజలకు కష్టంగా మారింది. ముఖ్యంగా రాత్రిళ్లు ప్రయాణికులకు, ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉంది. హైవే అధికారులు ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌లు టీ జంక్షన్ నుంచి అరకిలో మీటరు ఏర్పాటు చేయడం ఆ ప్రాంతంలో కనీసం లైట్లు కూడా లేక పోవడంతో ప్రయాణికులకు ఉపయోగపడకుండానే శిథిలమయ్యాయి. అంతే గాకుండా రాత్రిళ్లు ఈ ప్రాంతంలో వేచి ఉండాలంటే విషసర్పాలు సంచరించే ప్రాంతం కావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ఒంటరిగా మహిళా ప్రయాణికులు రావాలంటే జన సంచారం లేని ప్రాంతం కావడంతో భయంతో అల్లాడిపోతున్నారు. జాతీయ రహదారి అధికారులు ప్రజల సమస్యలను గుర్తించి సత్వరం ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

పీజీఆర్ఎస్‌తో సమస్యల పరిష్కారం



జిల్లాకు గోపాలకృష్ణయ్య పేరు పెట్టాలని ఆర్డీవోకు అర్జీ అందిస్తున్న నేతలు

చీరాల టౌన్: సమస్యలు పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక మంచి అవకాశమని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించారు. పలుశాఖల అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను ఆర్డీవోకు అందించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతు.. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలకు ఉన్న రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సమస్యలను అర్జీల ద్వారా అందిస్తే సత్వరమే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లాకు మంత్రి మండలి వస్తున్నందున జిల్లాకు మహనీయులైన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరు పెట్టాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. వివిధ రకాల రెవెన్యూ, భూ సమస్యలపై ప్రజలు 21 అర్జీలను అందించారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, ఉద్యోగులు ఉన్నారు. అలానే తహసీల్దార్ కార్యాలయంలో ఇంటిస్థలాలు, రేషన్‌కార్డులు తదితర సమస్యలపై డీటీ సుశీలకు ప్రజలు అర్జీలు అందించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

వేటపాలెం: ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి రక్తం దానం చేయడం అంటే వారికి ప్రాణం పోసిన వారవుతారని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ వనమా రామకృష్ణారావు పేర్కొన్నారు. కాలేజీలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ సౌజన్యంతో రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కే జగదీశ్‌బాబు ప్రారంభించారు. కళాశాలకు చెందిన 100 మంది విద్యార్థులు వారి రక్తాన్ని స్వచ్ఛందంగా దానం చేశారు. రక్తం దానం చేయడానికి విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు, చీరాల ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి కె నాగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డీ జ్యోతి స్వరూప్ పాల్గొన్నారు.

మోసానికి చిరునామా కూటమి పాలన



బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ పాల్గొన్న మండల కన్వీనర్, సర్పంచ్

- కూకట్లపల్లిలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ

బల్లికురవ: అధికారాన్ని చేపట్టేందుకు సూపర్ సిక్స్ పేరిట కూటమిపాలన అలివికాని హామీలిచ్చి ప్రజలను నయవంచనకు గురిచేసిందని మండల వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు ధ్వజమెత్తారు. సోమవారం రాత్రి మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో గ్రామ, బూత్ కమిటీల ఎంపికతోపాటు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో దివ్యాంగ వృద్ధాప్య పింఛన్లను కోతలు విధించి స్త్రీశక్తి పేరిట ఉచిత ప్రయాణాన్ని ప్రవేశపెట్టారని గ్రామీణ ప్రాంతాల్లో బస్సులు లేకుండా ఉచిత ప్రయాణం ప్రవేశపెట్టడం వల్ల ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. జగనన్న పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరిందని, కూటమి పాలనలో బడుగు బలహీన వర్గాలకు ఏ లబ్ధి దక్కటం లేదని కృష్ణబాబు అన్నారు. గ్రామ, బూత్ కమిటీలతో పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గుంటక నాగిరెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడిగా ఇప్పల యల్లమందారెడ్డిని మరో 10 మంది సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇప్పల అయ్యప్పరెడ్డి, జానకీర్ సుబ్బారెడ్డి, తాళ్ల రవీంద్రరెడ్డి, గౌరవరపు శ్రీనివాసరెడ్డి, ఇప్పల శివారెడ్డి, భవనం వీరాంజిరెడ్డి, గోగుల మూడి శ్రీనివాసరెడ్డి, పులి ఆంజనేయులు, కుర్రా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేరుగు నాగార్జునను కలిసిన కరణం



పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగార్జునతో మాట్లాడుతున్న వెంకటేష్‌బాబు

చీరాల అర్బన్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జునను వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ సోమవారం సంతనూతలపాడులోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. ఆయన వెంట పార్టీలో వివిధ హోదాలో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ కమిటీలు

యద్దనపూడి: మండలంలో పొగాకు పంట సాగు నియంత్రణ కోసం అధికారులతో మండల స్థాయి, గ్రామస్థాయిలలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ కాకి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సీజన్‌లో రైతులు విపరీతంగా బర్లీ పొగాకు సాగు చేసి కొనుగోలుదారు లేక నష్టపోయిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మండల స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలో తహసీల్దార్ చైర్మన్‌గా, వ్యవసాయ అధికారి కన్వీనర్‌గా, ఎస్సై, వైద్యాధికారి మెంబర్లుగా ఉంటారని ఆయన తెలిపారు. గ్రామస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసులు సభ్యులుగా ఉండి పొగాకు సాగు చేయకుండా పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు.

28న మాలల ప్రయోజనాల కోసం పాదయాత్ర

యద్దనపూడి: రిజర్వేషన్ల వర్గీకరణలో మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 28వ తేదీ మార్టూరు, యద్దనపూడి మండలాల్లో నిర్వహించనున్న పాదయాత్రను బాధిత కులాలు ఉపకులాల వారు సంఘటితంగా జయప్రదం చేయాలని అంబేద్కర్ జ్ఞాన సొసైటీ అధ్యక్షుడు మైలా చిన్న నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని తనుబొద్దివారిపాలెం గ్రామంలో యువకులతో మాట్లాడుతూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అయిన దాసరి చెన్నకేశవులు చేపట్టిన పాదయాత్ర ఈనెల 28వ తేదీ పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు, యద్దనపూడి మండలాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పాదయాత్రకు సంఘీభావంగా పెద్ద ఎత్తున మాలలు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

చిల్డ్రన్స్ పార్కు ప్రారంభం



చిల్డ్రన్స్ పార్కును ప్రారంభిస్తున్న నిర్వాహకులు

చీరాల రూరల్: స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి మైదానంలో చిన్నారులకు కొరకు నూతనంగా బేర్ క్రిస్టియన్ హాస్పటల్ నిర్వాహకులు డాక్టర్ చిక్కాల లలితా ఫెడ్రిక్ జ్ఞాపకార్థం రూ.10 లక్షల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కును సోమవారం రాత్రి రిటైర్డు మేజర్ సీఎన్.ఫెడ్రిక్ చేతులు మీదుగా ప్రారంభించారు. ముందుగా స్థానిక సంఘకాపరులు రెవరెండ్స్ పిల్లి దేవదాసు, పోకూరి నానిబాబులు దేవుని వాక్యసందేశాలు అందించారు. చర్చి చైర్మన్ దేటా అశోక్‌కుమార్ మాట్లాడుతూ పార్కు ఏర్పాటుకు ఆర్థికంగా సహకరించిన బేర్ క్రిస్టియన్ హాస్పటల్ నిర్వాహకులు ఫెడ్రిక్, ఇతర దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిక్కాల ప్రకాష్, చర్చి ట్రెజరర్ పేర్లి ఆనంద్, పీసీసీ, ఎల్‌సీసీ, సంఘస్థులు పాల్గొన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



కారంచేడులో టాస్క్‌ఫోర్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఏడీఏ, తహసీల్దార్



వేటపాలెంలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు



ఇంకొల్లులో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కారంచేడు: యూరియా కొరత సృష్టిస్తే షాపుల లైసెన్సు రద్దు చేస్తామని పర్చూరు వ్యవసాయ సహాయ సంచాలకులు జీడీ ప్రవీణ హెచ్చరించారు. సోమవారం ఆమె మండల కేంద్రం కారంచేడు పీఏసీఎస్‌ను తనిఖీ చేశారు. ఖరీఫ్‌లో ఈ ప్రాంత రైతులు సాగు చేసే వరి, మెట్టపైర్లకు అవసరమైన డీఏపీ, యూరియా వంటివి అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం అక్కడే టాస్క్‌ఫోర్స్ మీటింగ్ నిర్వహించారు. తహసీల్దారు జీ నాగరాజు, ఏఎస్ఐ మధుబాబుల సహకారంతో నిర్వహించిన మీటింగ్‌లో రైతులకు అవసరమైన ఎరువుల విషయంలో చర్చించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు సుమారు 16 వేల ఎకరాల్లో జరుగుతుందని అంచనా వేసామని ఏఓ నాగరాజు తెలిపారు. ఎరువుల కొనుగోళ్ల విషయంలో ఎంఆర్‌పీ ధరలకు మించి ఎక్కడా అమ్మకాలు చేయవద్దని వారు హెచ్చరించారు. ఒక వేళ ఎవరైనా ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పోతిన నాగేశ్వరరావు, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

అద్దంకి: మండలంలో అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయిని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. ఆయన సోమవారం ఒక ప్రకటనలో ఎరువుల వివరాలను తెలియజేశారు. ప్రైవేటు డీలర్లవద్ద 11 టన్నుల యూరియా, 142.5 టన్నుల డీఏపీ, 335 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో 32 టన్నుల యూరియా, 74 టన్నుల డీఏపీ ఉన్నాయని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరువుల షాపుల అకస్మిక తనిఖీ..

వేటపాలెం: మండల పరిధిలోని ఎరువులు, పురుగు మందుల షాపులను తహసీల్దార్ కే గోపీకృష్ణ అకస్మికంగా సోమవారం తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో ఎరువుల రికార్డులను పరిశీలించారు. గోడౌన్‌లలో నిల్వ ఉన్న స్టాకు.. రికార్డుల్లో నమోదు చేసిన వాటి వివరాలను తనిఖీ చేశారు. వీరి వెంట ఏవో సరిత, ఏఈవో గోపీకృష్ణ, ముస్నంగి జస్వంత్ సిబ్బంది ఉన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): మండలంలో అవసరమైనంత అందుబాటులో ఉందని ఏవో ఎస్ మేరిమ్మ సూచించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను సోమవారం ఎన్ ఫోర్స్‌మెంట్ బృందం తనిఖీ నిర్వహించారు. శ్రీరామచంద్ర ఏజెన్సీస్ దుకాణంలో 211 బ్యాగులు ఈపాస్ మిషన్‌లో నమోదై ఉండగా గోడౌన్‌లో కూడా 211 బస్తాలు యూరియా ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్, ఏఎస్ఐ ఎం నాగలక్ష్మి, ఎన్ఫోర్స్‌మెంట్ బృందం తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



స్థానికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీడీపీవో సుభద్ర, అధికారులు

మార్టూరు: మైనారిటీ తీరని యువతీ, యువకులకు వివాహాలు జరిపించి చేతులు దులుపుకోవాలని చూసే పెద్దలు ఎవరైనా సరే కటకటాలు లెక్కించాల్సి వస్తుందని ఐసీడీఎస్ పర్చూరు ప్రాజెక్టు సీడీపీవో సుభద్ర హెచ్చరించారు. రాజుపాలెం ఎస్టీ కాలనీలో సోమవారం మధ్యాహ్నం స్థానిక పెద్దలతో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆమె మాట్లాడారు. కాలనీకి చెందిన ఉయ్యాల సుజాత అనే మహిళ తన కుమార్తెకు 17 ఏళ్లు నిండకుండానే సమీప బంధువులు తన అనుమతి లేకుండా కుమార్తెకు వివాహం జరపటానికి ప్రయత్నిస్తున్నారని సుజాత అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో సుభద్ర బాల్యవివాహాల నష్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్.శిరీష, అంగనవాడీ, ఆశా కార్యకర్తలు మహిళా పోలీసు పాల్గొన్నారు. ఉయ్యాల సుజాత తమ బంధువులు తనపై దాడి చేసిన విషయమై మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పర్చూరులో వాహనాల తనిఖీ



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

పర్చూరు(చినగంజాం): వాహనాల సాధారణ తనిఖీలో భాగంగా పర్చూరులో సోమవారం పోలీసులు పలు వాహనాలను ఆపి తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ జీవీ చౌదరి ఆధ్వర్యంలో పర్చూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు పలు వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. వారాంతం తనిఖీలో భాగంగా వాహనాలు పరిశీలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్ఐ గోపి పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం



వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న దాత

అద్దంకి: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దామని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో గ్రామానికి చెందిన దివంగత తాటి బోయిన వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట సుబ్బారావు విద్యార్థులకు 100 పైగా వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. మట్టివినాయక విగ్రహాలను అందించిన దాత సుబ్బారావును హెచ్‌ఎం అభినందించారు. కార్యక్రమంలో దాత సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పర్చూరులో వినాయక ప్రతిమల పంపిణీ

పర్చూరు(చినగంజాం): వినాయక చవితి సందర్భంగా రోటరీ క్లబ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో 26వ తేదీ మంగళవారం ఉచితంగా వినాయక ప్రతిమల పంపిణీ జరుగుతుందని క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరు రోటరీ గంగ వద్ద మొత్తం 650 మట్టి వినాయక ప్రతిమలను, వ్రత కల్పముల పుస్తకాలను ఉదయం 10.30 గంటలకు పంపిణీ నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

రెండు షాపుల్లో విక్రయాల నిలిపివేత



మార్టూరులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మార్టూరు: రైతులకు యూరియా విక్రయాలు జరుగుతున్న తీరుపై సోమవారం వ్యవసాయ, రెవెన్యూ పోలీస్ శాఖ అధికారులు షాపులలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా స్థానిక అమరావతి నూలు మిల్లులో తనిఖీలు నిర్వహించగా మిల్లులో డైయింగ్ యూనిట్ లేనందున యూరియా వాడకం జరగడం లేదని అధికారులు గుర్తించారు. అనంతరం స్థానిక లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్ షాపులో నిర్వహించిన తనిఖీలో సరైన పత్రాలు చూపించకపోవడంతో రూ.1.01 లక్ష విలువ గల విక్రయాలు, పద్మ ఫర్టిలైజర్స్ షాపులో రూ. 2. 22 లక్షల విలువగల ఎరువులు ఈపాస్ చేయనందుకుగాను విక్రయాలు నిలిపివేసినట్లు లావణ్య తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి ప్రశాంతి, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, ఆర్ఐ అశోక్, వీఆర్ఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: రైతులకు ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. మండలంలోని పెదగంజాం గ్రామంలో సోమవారం మండల టాస్క్‌ఫోర్స్ బృందం ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సభ్యులు మండల ఏఓ ఆర్ చంద్రశేఖర్, ఏఎస్ఐ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.